
రెండు సంస్కృతుల మధ్య అజ్జి



రెండు సంస్కృతుల మధ్య అజ్జి



అప్పుడు యుద్ధం జరుగుతోంది. కథ అక్కడ మొదలవుతుంది.



ఇది అజ్జి కథ.



రోజురోజుకీ యుద్ధం అజ్జి వాళ్ల ఇంటికి దగ్గరవుతోంది. అయినా రోజులు మామూలుగానే ఉన్నాయి.



అజ్జి వాళ్ల నాన్న పిల్లల డాక్టరుగా తన
పని చేసుకుంటున్నాడు.



వాళ్ల అమ్మ అందమైన
బట్టలు కుడుతోంది.



నాయనమ్మ వెచ్చని కంబళ్లు
అల్లుతోంది.



ఉదయం అజ్జీని నాయనమ్మ బడి దగ్గర
దింపుతుంది.



సాయంత్రం అజ్జీ స్నేహితులు ఆమెతో
ఆడుకోటానికి వస్తారు.



కదం తొక్కుతూ వెళ్లే సైనికులను అప్పుడప్పుడు తోట గోడ మీద నుంచి చూస్తుంటారు.



అప్పుడప్పుడు హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు
చేసే మోతకి...



...కోళ్లు బెదిరి గుడ్లు పెట్టవు.



ఒక రోజు సాయంత్రం ఫోను వచ్చింది.
ఆ విషయం విన్న నాన్న ముఖం పాలిపోయింది.
“త్వరగా పదండి! కారులో కూర్చోండి!
సామాను సర్దుకునే సమయం కూడా లేదు.
మనం వెంటనే దేశం విడిచి వెళ్లాలి.
చాలా ప్రమాదకరమైన ఘడియలు ఇవి,”
అని అతను చెప్పాడు.
ఒక్క క్షణంలో అజ్జి జీవితం అంతా మారిపోయింది.



అమ్మ, నాన్న, నాయనమ్మ గదిలో పరుగులు తీశారు. నాన్న రాజ్‌మా గింజల సంచి తీసుకున్నాడు. నాయనమ్మ నేసిన కంబళిని అమ్మ తీసుకుంది. తనకి ఇష్టమైన ఎలుగుబంటి బొమ్మ బోబోని అజ్జి తీసుకుంది. అజ్జీకి నాయనమ్మ కోటు తొడిగింది.



“నేను ఇక్కడ ఉండి ఇల్లు చూసుకుంటాను," నాయనమ్మ చెప్పింది. “నా ప్రాణానికి ఎటువంటి భయమూ లేదు. మీరు బాధపడకండి. నేను తరవాత వస్తాను."
నాయనమ్మను వదిలి పెట్టి వెళ్లటం అజ్జీకి అన్నింటికంటే ఎక్కువ దుఃఖం కలిగించింది.





అజ్జీని అమ్మ కారు వెనక సీట్లో దాచిపెట్టింది. నాయనమ్మ అల్లిన కంబళితో ఆమెను కప్పింది.



కారుని నాన్న వేగంగా నడపసాగాడు.



ఉత్సాహం నింపటానికి అమ్మ పాటలు పాడుతోంది.



ఒక చోట కారు ఆపి సైనికులు లోపలికి టార్చిలైటు వేశారు. “కాగితాలు చూపించండి," అంటూ వాళ్లు అరిచారు. తనకి కాగితాలు లేవని అజ్జీకి తెలుసు. అందుకే భయపడుతూ చప్పుడు చెయ్యకుండా ఉంది. అయితే సైనికులు ఆమెని చూడలేదు.



నాన్న కారుని ఇంకా వేగంగా నడపసాగాడు.




అజ్జీకి చాలా దాహంగా, ఆకలిగా ఉంది.



తన ఎలుగుబంటి బొమ్మని గట్టిగా హత్తుకుంది. చివరికి ఆమె నిద్రపోయింది.



ఆమె మేలుకునేటప్పటికి కారు ఆగి ఉంది.
అమ్మ తలుపు తీసి ఉదయపు చల్ల గాలిలోకి అజ్జీని దింపింది.
వాళ్ల ముందు విశాలమైన సముద్రం ప్రశాంతంగా ఉంది.



సముద్రంలో ఒక పడవ లంగరు వేసి ఉంది. చాలామంది దానివైపు పరుగులు తీస్తున్నారు.
కారుని అక్కడే వదిలేసి నాన్న, అమ్మ, అజ్జీ కూడా అటు పరిగెత్తసాగారు.



రేవులో అంతా గందరగోళంగా ఉంది. జనం ఒకరినొకరు తోసుకుంటున్నారు.
యుద్ధ ప్రమాదం నుంచి తప్పించుకోటానికి పడవని చేరుకోటానికి వాళ్లంతా తొందరపడుతున్నారు.
అమ్మా, నాన్నా తమ బలం అంతా ఉపయోగించి ముందుకు వెళుతున్నారు.



మెట్ల మీద నుంచి కిందకి దిగి వాళ్లు పడవలోకి చేరుకున్నారు.
“పడవ నిండిపోయింది! ఇంకా ఎవ్వరికీ చోటు లేదు!" అంటూ సరంగు అరిచాడు.
తరవాత లంగరు ఎత్తి ఇంజిను స్టార్ట్ చేశాడు.
పడవ వేగంగా ముందుకు కదిలింది. కొంతసేపటికి వాళ్లు సముద్రం మధ్యలో ఉన్నారు.




అలలకి పడవ పైకి ఎగసి, కిందకి పడుతోంది. అలా ఎన్నో పగళ్లు, రాత్రుళ్లు గడిచాయి.
సముద్రాన్ని చీల్చుకుంటూ ఆ పడవ ముందుకు వెళుతూ ఉంది.



తడారిన పెదాలను నాలుకతో తడిమిన అజ్జీకి సముద్రపు ఉప్పదనం తగిలింది.
మెత్తగా ఉండే ఎలుగుబంటి బోబో సముద్రపు నీళ్లకి గట్టిగా అయిపోయింది.
పడుకుందామంటే నాయనమ్మ కంబళి తడిగా, చల్లగా ఉంది.



మరో రోజు మొదలవుతోంది. ఆకాశంలో ఒక్క నక్షత్రం మాత్రమే మిగిలి ఉంది.
ఊదా, బూడిద రంగులలో నేల కనపడుతోంది.
అజ్జీ ఒక కొత్త దేశాన్ని మొదటిసారి చూస్తోంది.


కొత్త దేశంలో అంతా కొత్తగా ఉంది. మనుషులు అంతా కొత్తగా ఉన్నారు. అజ్జీ తినటానికి వాళ్లు ఇచ్చిన ఆహారం కొత్తగా ఉంది.
మీ కాగితాలు చూపిస్తారా?
అమ్మా, నాన్నలకు కూడా అర్థం కాని భాషలో అక్కడి వాళ్లు మాట్లాడసాగారు.



అప్పుడు వాళ్ల భాష మాట్లాడే ఒక వ్యక్తి కలిశాడు. అతను, నాన్న చాలాసేపు మాట్లాడుకున్నారు.



ఆ తరవాత ఒక బస్సులో తమ కొత్త ఇంటికి వెళ్లారు.



కాని అది తమ పాత ఇల్లు లాగా ఏమాత్రం లేదు. ఒకే గదితో అది చాలా చిన్నగా ఉంది. స్నానాల గది బయట ఉంది. “చూడు అజ్జీ," అమ్మ అంటోంది, “దయగల మనుషులు మనకు సామాను, వంట గిన్నె ఇచ్చారు."

“పని చెయ్యటానికి నాకు త్వరలోనే అనుమతి దొరుకుతుంది," నాన్న అన్నాడు. “అప్పుడు ఇంకా మంచి ఇల్లు చూసుకుందాం."

‘కానీ, నాయనమ్మ లేకుండా మంచి ఇల్లు ఎలా అవుతుంది?’ అనుకుంది అజ్జీ.



చాలా రోజులపాటు అజ్జి, వాళ్ల అమ్మ ఆ పెద్ద నగరంలో రోడ్ల మీద తిరిగారు.
తరవాత వాళ్లకి అజ్జి లాంటి వాళ్లను చేర్చుకునే బడి గురించి తెలిసింది.



అజ్జి తన కొత్త టీచరుని కలుసుకుంది. అతడు ఆమెతో చేయి కలిపి, ఎంతో ప్రేమతో, “హలో, అజ్జీ. నా పేరు మిల్లర్. సోమవారం నాడు బడికి వస్తావని ఎదురుచూస్తుంటాను," అన్నాడు. అమ్మకు కేవలం ‘సోమవారం’ అన్న పదం మాత్రమే అర్థమయ్యింది. అమ్మ తల ఊపి నవ్వింది.



ఆదివారం రాత్రి అజ్జీని అమ్మ సోఫాలో పడుకోబెట్టింది. కానీ నాయనమ్మ గురించే అజ్జీ ఆలోచిస్తూ ఉంది – యుద్ధంలో ఉన్న తమ దేశంలో ఆమె ఒంటరిగా ఎలా ఉంది?



తరవాత ఆమె తన కొత్త బడి గురించి ఆలోచించసాగింది.
తనకి ఇక్కడి కొత్త భాష రాదు కదా, మరి కొత్త స్నేహితులను చేసుకోవటం ఎలా?
కొత్త టీచరు చెప్పేది ఎలా అర్థం చేసుకుంటుంది?



బడిలో గోలగోలగా ఉంది! పిల్లలందరూ అజ్జీని పట్టించుకోకుండా పరిగెడుతున్నారు. ఆమె భాష వేరుగా ఉంది, ఆమె బట్టలు వేరుగా ఉన్నాయి. ఒక్కరు కూడా ఆమెను పలకరించలేదు.



బడి గంట మోగటంతో మిల్లర్ తరగతిలోకి మిగిలిన పిల్లలతో అజ్జీ వెళ్లింది. ఆమెకు దుఃఖంగా ఉంది. కానీ, 'నేను ఏడవను,' అని తనకు తాను చెప్పుకుంది.



పిల్లలు మాట్లాడకుండా చెయ్యటానికి మిల్లర్ తప్పట్లు కొట్టాడు. "ఈ రోజు నుంచి అజ్జి మన తరగతికి వస్తుంది. ఆమెకు స్వాగతం పలకండి!" అని మిల్లర్ చెప్పాడు. కానీ, అతను ఏం చెప్పాడో అజ్జీకి అర్థం కాలేదు.



చివరికి తనకి అర్థమయ్యే పదాలు...



తన భాషలో మెత్తని స్వరంలో
వినిపించాయి.



ప్రేమ నిండిన చూపులతో ఒక మహిళ అజ్జీకి కనిపించింది. “హలో అజ్జీ, నా పేరు సబీనా. నీకు సహాయం చెయ్యటానికి వచ్చాను."



మిల్లర్ ఏం చెపుతున్నాడో సబీనా వివరించింది. ఆమె అజ్జీకి కొన్ని కొత్త పదాలు నేర్పించింది. త్వరలోనే ‘హలో’, ‘బై’, ‘నా పేరు అజ్జి,’ అని చెప్పటం ఆమె నేర్చుకుంది.



భోజన సమయంలో అజ్జీకి మళ్లీ ఒంటరిగా అనిపించింది. అమ్మ వండి ఇచ్చినది ఆమె తిన్నది. ఇతరులు తెచ్చుకున్నదానికంటే అది తేడాగా ఉంది.



అన్నం తిన్న తరవాత కొక్కానికి వేలాడదీసిన తన కోటు వేసుకుని ఆటల మైదానంలోకి వెళ్లింది.



ఒక అమ్మాయి ఆమె వైపు పరిగెత్తుకుంటూ వచ్చింది. “హలో, నా పేరు లూసీ," అంటూ ఆమె పలకరించింది. సబీనా నేర్పించింది అజ్జీకి గుర్తు వచ్చింది, “బై, నా పేరు అజ్జీ," బదులిచ్చింది.



“నువ్వు ‘హలో’ చెప్పాలనుకున్నావు," అంటూ లూసీ నవ్వింది. “హలో, నా పేరు అజ్జీ, బై," అంది అజ్జీ. లూసీ పెద్దగా నవ్వింది, అజ్జీ కూడా నవ్వేసింది. “పద, తాడాట ఆడుకుందాం," లూసీ అంది.



లూసీ తాడాట ఆడుతునప్పుడు అజ్జి చూసింది.
తాడు తట్టుకోకుండా లూసీ ఆరు సార్లు గెంతింది. ఆ తరవాత అజ్జి వంతు.



తాడు తట్టుకోకండా అజ్జి ఇరవై సార్లు గెంతింది. ఆ రోజు 'స్కిప్' అనే ఒక కొత్త పదం అజ్జి నేర్చుకుంది.



రోజులు గడుస్తున్న కొద్దీ బడి పనిలో అజ్జీకి సబీనా సహాయం చేస్తోంది.
ఒక రోజు అజ్జీ తుపాకులు, హెలికాప్టర్ బొమ్మ వేసింది.



ఆ తరవాత యుద్ధానికి సంబంధించిన కథలు – అమ్మా, నాన్నలతో తాను తప్పించుకుని ఎలా వచ్చింది, నాయనమ్మని అక్కడే వదిలి రావటం ఎలా బాధిస్తోంది సబీనాకి అజ్జీ చెప్పసాగింది. “నీకు ఎలా అనిపిస్తోందో నేను అర్థం చేసుకోగలను," సబీనా చెప్పింది. “మన దేశం వదిలిపెట్టి వచ్చినప్పుడు నాకు ఆరు సంవత్సరాలే."


తాము ఎలా తప్పించుకుని
వచ్చారో అజ్జీకి సబీనా చెప్పింది.
“నా కుటుంబంతో ఒక
అడవి గుండా
ప్రయాణం చేశాం,
నదులు దాటాం,
కొండలు ఎక్కాం,
చివరికి ఒక
శిబిరానికి వచ్చాం.
మేం చాలా సంవత్సరాలు
ఆ శిబిరంలో ఉన్నాం.
చివరికి, వెళ్లటానికి నాకు
అనుమతి దొరికింది.
కానీ మిగిలిన వాళ్లు
అక్కడే ఉండిపోవటం
నన్ను ఎంతో బాధించింది.
“ఏదో ఒక రోజు వాళ్లు
ఇక్కడికి వస్తారు,” సబీనా
చెప్పింది. “నువ్వు కూడా
ఏదో ఒక రోజు మీ
నాయనమ్మని కలుస్తావు."



ఆ తరవాత అమ్మతో సబీనా తరచు కలిసి, మాట్లాడుతూ ఉండేది. ఒక రోజు ఆమె, "బడిలో అజ్జీ బాగా చదువుతోంది. ఆమె ఇంగ్లీషు రోజు రోజుకీ మెరుగవుతోంది," అని చెప్పింది. "తన మాతృభాషని ఆమె మరిచిపోవటం నాకు ఇష్టం లేదు," అమ్మ చెప్పింది. "లేదు, లేదు!" సబీనా నవ్వుతూ బదులిచ్చింది. "నా లాగా ఆమె రెండు భాషలూ మాట్లాడుతుంది."



ఇంటికి వెళ్లేటప్పుడు తాను ఆ రోజు నేర్చుకున్న కొత్త పదాలను అజ్జీకి అమ్మ చెప్పింది. 'ఇది నాకు ఇష్టం,', 'అది ఎంత?', 'అరటిపండు'.



బడిలో తాను నేర్చుకున్న కొత్త పదాలను అమ్మకి చెప్పింది అజ్జీ. 'దీనిని నేను తీసుకోవచ్చా?', 'ఇది ఏమిటి?', 'నాయనమ్మ'.



ఆ రోజు ఇంటికి వచ్చేసరికి నాన్న బాగా అలసిపోయి తాను నేర్చుకున్న కొత్త పదాలు చెప్పకుండా పడుకున్నాడు. అమ్మ వంట చేస్తోంది. "మీకు ఇంకా పని ఏమీ దొరకలేదా, నాన్నా?" అజ్జీ అడిగింది.

"లేదు అజ్జీ," నాన్న బదులు ఇచ్చాడు. "ఇక్కడ పని చెయ్యటానికి నాకు ఇంకా అనుమతి దొరక లేదు. కనీసం పెరడు ఉంటే నా రాజ్‌మా మొక్కలను నాటేవాడిని. అవి మన భోజనానికి వచ్చేవి. కానీ ఇప్పుడు నా విత్తనాలు ఉపయోగపడకుండా ఉన్నాయి. నాకేమొ చెయ్యటానికి ఏ పనీ లేదు." ఆ తరవాత అతను తన కళ్లు మూసుకున్నాడు.



ఇంగ్లీషులో పది దాకా లెక్కపెట్టటం బడిలో అజ్జీ నేర్చుకోవటం మొదలుపెట్టింది.
“త్వరలోనే నా కాలి వేళ్లను కూడా లెక్క పెట్టేస్తావు," సబీనా అంది.



భోజన సమయంలో ఆమె తరచు లూసీతో తన ఆహారాన్ని మార్చుకునేది.
“ఈ శనగల కూర చాలా బాగుంది!" లూసీ చెప్పింది.



వసంతంలో వెచ్చగా ఉన్న ఒక రోజు పిల్లలతో మిల్లర్ మాట్లాడాడు.
“రేపటినుంచి మనం తోట తరగతులు మొదలుపెడదాం. విత్తనాలు తెచ్చి బడి తోటలో నాటదాం. విత్తబోయే వాటి బొమ్మలు ఎవరు వేస్తారు?"
“నేను!" అంటూ పిల్లలందరూ ఒక్కసారిగా అరిచారు.


బొమ్మలు వేశారు...
టమాటా,
పాలకూర,
గుమ్మడి,
పొద్దుతిరుగుడు.
అజ్జీ అప్పుడు కలలు కంటోంది. తమ పెరటిలో పచ్చగా ఉన్న టమాటాలు ఎర్రబడటం, పాలకూర గుబురుగా పెరగటం, కంచె మీదకి గుమ్మడి పాదు ఎగబాకటం, వంటింటిలో తనకు ఇష్టమైన రాజ్‌మా కూర తింటుంటే చూడటానికి పొద్దు తిరుగుడు తనవైపు ముఖం తిప్పుకోవటం అజ్జీకి గుర్తు వస్తున్నాయి.
అజ్జీ లేచి బోర్డు దగ్గరకు వెళ్లింది. ఆమె రాజ్‌మా గింజ బొమ్మ గీసింది.
“బాగుంది, అజ్జీ," మిల్లర్ మెచ్చుకున్నాడు.
“మనం దానిని తినవచ్చు. లేదా, దానిని నాటితే, మొక్క పెరిగి మనకి ఇంకా చాలా గింజలు ఇస్తుంది."
ఆ క్షణంలో అజ్జీకి ఒక మంచి ఆలోచన వచ్చింది.



అవును! నాన్న సంచిలోని
ప్రత్యేక రాజ్‌మా విత్తనాలు
తీసుకుంటుంది.
వాటిని తనే బడి తోటలో
నాటుతుంది.
తరవాత నాన్నకి బహుమతి
ఇస్తుంది!
ఇంటికి తిరిగి వచ్చిన అజ్జీ
సంచి వైపు పరుగు తీసింది.
ఆమె సంచి లోపల వెతికింది.
అది ఖాళీగా ఉంది!
గదిలో కమ్మని వంట రుచి
వస్తోంది!
“చూడు, అజ్జీ,” అమ్మ పిలిచింది,
“నీకు ఇష్టమైన రాజ్‌మా కూర
వండుతున్నాను!”
అజ్జీ కళ్ల నుంచి ధారగా
కన్నీళ్లు కారుతున్నాయేంటి?
నువ్వు ఇవ్వాళ అలసి
పోయినట్టు ఉన్నావు!
అజ్జీ బాధ ఏమిటో అమ్మకి
అర్థం కాలేదు.



ఆ రోజు రాజ్‌మా కూర తినటం అజ్జీకి చాలా కష్టంగా అనిపించింది. ప్రతి గింజ ఒక మొక్క అయ్యి, ప్రతి మొక్కకి ఎన్నో కాయలు కాసి, చలికాలంలో తమకి, బడిలో పిల్లలకు కావలసినన్ని గింజలు తయారు అయ్యేవి, పాత ఇంటిలో సంతోషంగా ఉన్నట్టు నాన్నకు సంతోషం కలిగించేది.



అజ్జీకి ఆ రాత్రి నిద్ర రాలేదు. అందుకే గడిచిపోయిన సంతోష ఘడియల గురించి ఆలోచిస్తూ ఉంది. అమ్మ తనకి కొత్త బట్టలు కుడుతున్నట్టు, నాయనమ్మతో కలిసి ఊలు సరిచేస్తున్నట్టు ఊహించుకుంది. కానీ కాసేపటికే ఆందోళనలు ఆమెను చుట్టుముట్టాయి. ఈ కొత్త దేశంలో తాము క్షేమంగా ఉండగలుగుతారా? తమ దేశంలో నాయనమ్మకి ఎటువంటి ప్రమాదం లేదు కదా?



ఉన్నట్టుండి అజ్జీ లేచి కూర్చుంది. పరుపు కింద ఏదో గట్టిగా తగులుతోంది!
రాజ్‌మా గింజలు! కొన్ని గింజలు సంచిలోంచి జారి అక్కడ పడ్డాయి. వాటిని ఎవరూ చూడలేదు.
అందుకనే ఆ రాజ్‌మా గింజలను ఎవరూ వండలేదు, ఎవరూ తినలేదు.
బడి తోటలో విత్తటానికి అజ్జీకి ఎనిమిది మంచి రాజ్‌మా విత్తనాలు దొరికాయి.
ఆమె సోఫా మీదకి ఎక్కి ఆ విత్తనాలను తన కోటు జేబులో జాగ్రత్తగా వేసింది.
తరవాత నాయనమ్మ ఇచ్చిన కంబళిలోకి దూరి సంతోషంగా నిద్రపోయింది



ఎనిమిది రాజ్‌మా విత్తనాలు! వాటిని విత్తే రోజు ఇదే. ఒడి తోటలో అజ్జీ ఎనిమిది పుల్లలు గుచ్చింది. ప్రతి పుల్ల దగ్గర ఒక్కొక్క రాజ్‌మా విత్తనానికి పాదు చేసింది.



"రాజ్‌మా విత్తనాలు ఇలా నాటాలని నీకు ఎవరు నేర్పించారు, అజ్జీ?" మిల్లర్ అడిగాడు.
"మా నాయనమ్మ," అజ్జీ బదులిచ్చింది.
"ఇప్పుడు అది నువ్వు మాకు నేర్పిస్తున్నావు," సబీనా అంది.


బడి నుంచి ఇంటికి వెళ్లే దారిలో
మొలకెత్తబోయే రాజ్‌మా విత్తనాల గురించే
అజ్జి ఆలోచిస్తోంది.
అమ్మ కూడా ఒక రహస్యం దాచి పెట్టింది. ఆమె
చాలా సంతోషంగా ఉంది. చిరునవ్వులు చిందిస్తోంది.
నీకొక ఆశ్చర్యం!
వాళ్లు రోడ్డు దాటి,
సిద్ధంగా ఉన్నావా?
ఇంటికి చేరుకున్నారు.


“అజ్జీ, కళ్లు మూసుకో,” అమ్మ అంది.
“ఇప్పుడు కళ్లు తెరువు,” చెప్పింది అమ్మ.
“నాయనమ్మా!” అంటూ అజ్జీ అరిచింది.
ఆమె పరిగెత్తుకుంటూ వెళ్లి నాయనమ్మ వడిలో వాలిపోయింది. ఆమె సంతోషంతో ఏడుస్తోంది. నాయనమ్మ కూడా సంతోషంతో ఏడుస్తోంది. అమ్మా, నాన్నా కూడా.


నాయనమ్మ బాగా అలసిపోయి ఉంది. అయినా అన్నం తిన్న తరవాత ఆమె తన కథ చెప్పింది.
“ఆయుధాలతో కొందరు దుష్టులు ఇంటిలోకి వచ్చారు. నేను చాలా భయపడ్డాను.
అందమైన ఇల్లు, తోట, కోళ్లు – అన్నీ వదిలిపెట్టి రావలసి వచ్చింది.
ఈ ప్రయాణానికి నా బంగారు కంకణం అమ్మాల్సి వచ్చింది.
ఒక పెద్ద లారీలో రాత్రి అంతా ప్రయాణం చేశాను. అది ప్రమాదకరంగానూ, కష్టతరంగానూ ఉండింది.
పగలు ఎక్కడన్నా ఆగి, దాక్కునే వాళ్లం.
ఇక్కడికి చేరుకున్న తరవాత నన్ను మళ్లీ వెనక్కి పంపించి వేస్తారేమోనని భయపడ్డాను.
ఇక్కడ ఉండవచ్చని చెప్పిన తరవాత నేను చాలా సంతోషించాను.
ఇప్పుడు మనమంతా క్షేమంగా ఉన్నాం, అంతా కలసి ఉన్నాం. ఇంతకు మించి ఏం కావాలి," అంది నాయనమ్మ.



ఆ ఇరుకు గదిలో చాలా రోజులు ఉన్న తరవాత ఒక రోజు నాన్న కాగితాలు వచ్చాయి.
“మనం ఇక్కడ ఉండవచ్చు!" నాన్న అరిచాడు.
“మనకిక ఏ ప్రమాదమూ లేదు! నేను పని చెయ్యవచ్చు! అందరూ నాతో రండి!"



గది నుంచి బయటకు వచ్చి, మెట్లు దిగి, బయటకు పరిగెత్తారు. మలుపు తిరిగి చిన్న పెరడు ఉన్న ఇంటిలోకి వెళ్లారు.



“నేను ఇప్పుడు పని చేస్తాను కాబట్టి మనం ఈ ఇంటిలో ఉండవచ్చు," నాన్న చెప్పాడు.
“ఇక్కడ రెండు గదులు, స్నానాల గది ఉన్నాయి. పెరడులో కూరగాయలు పండించుకోవచ్చు."
“ఇక్కడ కుట్టుమిషనుకి కూడా చోటు ఉంది!" అమ్మ అంది.
“అల్లిక పనికి కూడా!" నాయనమ్మ అంది.
“లూసీ తోటి తాడాట ఆడుకోటానికి ఇక్కడ చోటు ఉంది!" అజ్జీ అంది. ‘నా కొత్త ఇల్లు కూడా పాత ఇంటి లాగా ఎప్పటికీ ఉండదు. కానీ పరిస్థితులు మెరుగుపడుతున్నాయి,’ అని ఆమె అనుకుంది.



వేసవి అంతా బడిలో అజ్జీ కొత్త కొత్త విషయాలు నేర్చుకుంది.




ఇంటి దగ్గర నాయనమ్మ పాత రోజుల కథలు చెప్పేది.



మరో దేశం నుంచి జమాల్ అనే అబ్బాయి వచ్చాడు. అతడు ఇంగ్లీషు నేర్చుకోవటంలో అజ్జీ, లూసీ సహాయపడ్డారు.



బడి తోటలో ప్రతి రోజు రాజ్మా తీగలు కర్రల పై పైకి పాకుతున్నా . వాటి పూల మీద తేనెటీగలు తిరుగుతున్నాయి. కాయలు కిందకి వేలాడసాగాయి, వాటిలో గింజలు పెద్దగా అవుతున్నాయి.



వేసవికాలం దాదాపు అయిపోవచ్చింది. అజ్జీ నాటిన రాజ్‌మా మొక్కలు గోధుమ రంగుకు మారి ఎండిపోయాయి. లోపలి గింజలు గలగలమంటూ శబ్దం చేస్తున్నాయి.
“మా దేశంలో వీటిని ఈ సమయంలో కోస్తాం," అజ్జీ చెప్పింది.
మిల్లర్, సబీనా, పిల్లలందరూ కలిసి రాజ్‌మా కాయలు కోశారు. వాటిని వలిచి, గింజలు వేరు చేశారు. ఎర్రటి రాజ్‌మా గింజలతో ఒక సంచి నిండిపోయింది.
“వసంతంలో మళ్లీ నాటటానికి కొన్ని విత్తనాలు ఉంచుకోవచ్చా, అజ్జీ?" మిల్లర్ అడిగాడు. “అప్పుడు, మన బడిలో భోజనానికి కావలసినన్ని రాజ్‌మా పండించుకోవచ్చు."
“తప్పకుండా," అజ్జీ బదులిచ్చింది. ఇప్పుడు ఆమె ఆ దేశపు భాషలో మాట్లాడగలుగుతోంది.



రాజ్‌మా గింజల సంచిని ఇంటికి తీసుకుని వెళ్లింది అజ్జీ. నాన్న వాటిని చూశాడు. అలా చూస్తూనే ఉండిపోయాడు. వాటిల్లోకి తన వేళ్లను పోనిచ్చాడు.
“ఈ గింజలు అచ్చం మన దేశంలోని గింజల లాగానే ఉన్నాయి!" అని అన్నాడు.
“అనుమానం లేదు!" అజ్జీ చెప్పింది. “సోఫాలోని పరుపు కింద నాకు ఎనిమిది గింజలు దొరికాయి. వాటిని నేను బడి తోటలో నాటాను. అందుకే మనకి ఇప్పుడు ఒక సంచి రాజ్‌మా గింజలు తయారయ్యాయి!" అజ్జీని నాన్న ముద్దు పెట్టుకున్నాడు.




తమ తోటలో వసంతంలో నాటటానికి కొన్ని విత్తనాలు వేరు చేసి పెట్టాడు.



కూర వండటానికి నాయనమ్మ కొన్ని గింజలు తీసుకుంది.



మిగిలిన వాటిని చలికాలంలో వండుకోటానికి అమ్మ భద్రపరిచింది.



“ఇప్పుడు సంతోషంగా ఉన్నారా, నాన్నా?" అజ్జీ అడిగింది.
“నా సంతోషాన్ని నువ్వు పెంచుతున్నావు, అజ్జీ," నాన్న అన్నాడు.
“రాజ్‌మాతో ఒక ప్రత్యేకమైన వంటకం గురించి ఆలోచిస్తున్నాను," అంది అమ్మ.
“కొత్త గింజలు, కొత్త జీవితం," పొయ్యి మీద నుంచి గిన్నె దించుతూ నాయనమ్మ అంది.
బోటో నవ్వింది. అది ఎప్పుడూ నవ్వుతూనే ఉంటుంది.



అజ్జీ, వాళ్ల అమ్మా, నాన్న ప్రమాదంలో ఉన్నారు. . .

వాళ్లు తమ దేశం వదిలి కొత్త దేశానికి వెళ్లాల్సి వచ్చింది. అక్కడ తెలియని వాళ్ల మధ్య ఉండాలి, భాష కూడా కొత్తే. తన జీవితంలోని నాటకీయ పరిణామాలను ధైర్య, సాహసాలతో ఎదుర్కోవటం అజ్జీ నేర్చుకుంది. అయితే, నాయనమ్మ తమ దేశంలోనే ఉండిపోయింది. మళ్లీ నాయనమ్మని కలుసుకో గలుగుతుందా?

సున్నితత్వం, హాస్యం కలబోసిన ఈ సాహస గాథ అన్ని వయసుల వారిని అలరిస్తుంది.







ISBN 978-1-84780-261-3
51799

UK£12.99 US$17.99

FRANCES LINCOLN CHILDREN'S BOOKS
www.franceslincoln.com